ప్రజాశక్తి

ఆదివారం 19 నవంబర్ 2023

రోలర్ స్కేటింగ్‌లో హాసినికి 2 బంగారు పతకాలు

ప్రజాశక్తి-విజయనగరం

ఈనెల 14 నుంచి 17వ తేదీ వరకు విశాఖపట్నంలో జరిగిన 35వ రాష్ట్ర స్థాయి రోలర్ స్కేటింగ్ పోటీలలో విజయనగరానికి చెందిన పొన్నాడ హాసిని 11-14 వయస్సు బాలికల విభాగం లో 2 బంగారు పతకాలు, 1 సిల్వర్ పతకం సాధించింది. వచ్చే నెల చెన్నైలో జరగబోయే జాతీయ స్థాయి పోటీలకు అర్హత సాధించింది. అంతేకాకుండా అక్టోబర్ నెలలో పూణేలో జరిగిన 52వ జాతీయ స్థాయి పోటీలలో పాల్గొని 1 సిల్వర్ మెడల్, 1 బ్రాంజ్ మెడల్ సాధించింది. కోచ్ రాజు ఆధ్వర్యంలో శిక్షణ తీసుకొని ఇప్పటివరకు మొత్తం 5 సార్లు జాతీయ స్థాయి పోటీల్లో పాల్గొంది. ఈ సందర్భంగా హాసినిని పలువురు అభినందించారు.

పతకాలతో హాసిని

దీక్షల భగ్నానికి పోలీసుల యత్నం

- అడ్డుకున్న ఎస్‌ఎఫ్‌ఐ కార్యకర్తలు
- వెనుదిరిగిన పోలీసులు
- రెండో రోజుకు దీక్షలు
- టిడిపి, జనసేన మద్దతు

ఎస్‌ఎఫ్‌ఐ నాయకులను అరెస్టు చేసేందుకు ప్రయత్నిస్తున్న పోలీసులు

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

విద్యారంగ సమస్యల పరిష్కారానికి ఎస్‌ఎఫ్‌ఐ ఆధ్వర్యంలో కలెక్టరేట్ వద్ద చేపట్టిన నిరవధిక దీక్షను శనివారం రాత్రి భగ్నం చేసేందుకు పోలీసులు ప్రయత్నం చేశారు. ముందుగా ప్రభుత్వ వైద్యుల ద్వారా దీక్షలో కూర్చున్న నాయకులకు వైద్య పరీక్షలు చేయించారు. దీక్షలో ఉన్న నలుగురు ఎస్ ఎఫ్ ఐ నాయకులకు షుగర్ లెవెల్స్ 80 కిందకు పడిపోవడంతో ఆరోగ్యం క్షీణిస్తోందని భావించి అరెస్టు చేసేందుకు పోలీసులు ప్రయత్నం చేశారు. ఎస్‌ఎఫ్‌ఐ కార్యకర్తలు అడ్డుకోవడంతో పోలీసులు, ఎస్‌ఎఫ్‌ఐ కార్యకర్తలకు కొద్ది సేపు పెనుగులాట జరిగింది. విద్యార్థులు ఎక్కువగా ఉండటంతో పోలీసుల ప్రయత్నం విఫలమైంది. దీంతో పోలీసులు వెనుదిరిగారు. అనంతరం దీక్ష శిబిరం వద్ద జానపద కళాకారులు డప్పు శ్రీను, తిరుపతిరావు, రాము విప్లవ గీతాలు ఆలపించారు. దీక్షా శిబిరం వద్దకు సిఐటియు తమ్మినేని సూర్యనారాయణ, టివి రమణ, వి.లక్ష్మి, నాగభూషణం, ఇఫ్టు జిల్లా ఉపాధ్యక్షులు కె.అప్పలసూరి, యుటిఎఫ్ నాయకులు దీక్షలకు మద్దతు తెలిపారు.

మరోవైపు దీక్షలు రెండోరోజు చేరుకున్నాయి. శనివారం టిడిపి మాజీఎమ్మెల్యే మీసాల గీత, జనసేన నాయకులు గురాన అయ్యలు దీక్షా శిబిరాన్ని సందర్శించి ఎస్‌ఎఫ్‌ఐ నాయకులకు మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎస్‌ఎఫ్‌ఐ చేస్తున్న న్యాయమైన పోరాటానికి అండగా ఉంటామన్నారు. ఎస్‌ఎఫ్ ఐ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు సి హెచ్. వెంకటేష్ , పి రామ్మోహన్ మాట్లాడుతూ జిల్లాలో పేరుకుపోయిన విద్యారంగ సమస్యలను కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లామని, ఇప్పటివరకు ఎటువంటి స్పష్టమైన హామీ ఇవ్వలేదు అని తెలిపారు. రోజు రోజుకు ఆరోగ్యం క్షీణిస్తున్నా దీక్ష కొనసాగుతుందని తెలిపారు. అనంతర పరిణామాలకు, విద్యార్థుల ఆందోళనకు జిల్లా విద్యా యంత్రాంగం బాధ్యత వహించాల్సి ఉంటుందని హెచ్చరించారు. ఈనెల 21న జరిగే చలో కలెక్టరేట్‌ను జయప్రదం చేయాలని కోరారు.

ఎస్‌ఎఫ్‌ఐ దీక్షలకు సంఘీభావం తెలుపుతున్న మాజీ ఎమ్మెల్యే మీసాల గీత

జిల్లాలో యువకులకు, పెద్దలకు, మహిళలకు అందరికీ క్రికెట్ ఫీవర్ పట్టుకుంది. 12 ఏళ్ల అనంతరం భారత్ జట్టు క్రికెట్ ప్రపంచకప్ ఫైనల్‌కు చేరుకోవడం, ఆదివారం ఆసీస్‌తో తలపడనుండడంతో అందరిలోనూ ఒకటే టెన్షన్. వరుస విజయాలతో ఫైనల్‌కు చేరిన భారత్‌జట్టు ఆస్ట్రేలియా జట్టును ఓడించి 2003 నాటి ప్రతీకారాన్ని తీర్చుకోవాలని ఆకాంక్షిస్తున్నారు. ఈ నేపథ్యంలోనే ఆదివారం మధ్యాహ్నం నుంచి టివిలకు, నగరంలోని పలు ప్రాంతాల్లో ఏర్పాటు చేసిన ఎల్‌ఇడి స్క్రీన్లకు అతుక్కుపోయేందుకు సిద్ధమైపోయారు. ఎక్కడ చూసినా క్రికెట్ ఫైనల్ మ్యాచ్ కోసం చర్చోపచర్చలు సాగుతున్నాయి. ఆదివారం మధ్యాహ్నం ఎప్పుడొస్తుందా అని ప్రజలు, క్రీడాకారులు, క్రీడాభిమానులు ఎదురు చూస్తున్నారు.

క్రికెట్ ఫీవర్

వీక్షణకు నగరంలో పలుచోట్ల భారీ స్క్రీన్లు

ప్రజాశక్తి-విజయనగరంటౌన్

జిల్లాలో ప్రస్తుతం ఎక్కడ చూసినా క్రికెట్ ఫీవర్ కనిపిస్తోంది. ఎవరి నోట విన్నా 'ప్రపంచ కప్ విన్నర్ భారత్' అంటూ తమ ఆనందాన్ని వ్యక్తం చేస్తున్నారు. ప్రపంచ కప్ సెమీఫైనల్లో ఇండియా, న్యూజిలాండ్ క్రికెట్ మ్యాచ్ ఉత్కంఠ భరితంగా సాగగా, క్రికెట్ అభిమానులు టీవీలకు అతుక్కుపోయి మ్యాచ్‌ను వీక్షించిన దృశ్యాలు కనిపించాయి. ఎన్నడూ లేని రీతిలో ఈసారి ప్రపంచకప్‌లో ఇండియా క్రికెట్ టీం అన్ని విజయాలను అందుకోవడంతో క్రికెట్ అభిమానుల్లో ఆనందాలకు అవధులు లేవు. సెమీ ఫైనల్‌లో ఇండియా జట్టు గెలిచిన వెంటనే జిల్లా వ్యాప్తంగా క్రికెట్ అభిమానులు సంబరాలు చేసుకున్నారు. ఈ నేపథ్యంలో ఆదివారం ఆస్ట్రేలియాతో జరిగే ఫైనల్ కోసం జిల్లా వ్యాప్తంగా అందరూ ఎదురుచూస్తున్నారు. ఇండియా జట్టు ప్రపంచకప్పును ఒడిసిపట్టాలని ఆకాంక్షిస్తున్నారు. విజయనగరంలో క్రికెట్ అసోసియేషన్‌తో పాటు ,మహిళా పార్కు లో మహిళలు చూసేందుకు భారీ స్క్రీన్, ఇనాక్స్ దగ్గర ఒక స్క్రీన్, అదే విధంగా పలు ప్రైవేటు హోటళ్లలోను, బార్లలోను స్క్రీన్లు ఏర్పాటు చేస్తున్నారు.

పది వేల మంది చూసేందుకు ఏర్పాట్లు

ప్రజలంతా భారత క్రికెట్ జట్టుకు మద్దతు తెలపాలని జిల్లా క్రికెట్ అసోసియేషన్ కార్యదర్శి ఎమ్ ఎల్ ఎన్ రాజు తెలిపారు. ఐస్ ఫ్యాక్టరీ జంక్షన్ సమీపం, ఎగ్జిబిషన్ మైదానంలో శనివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఫైనల్ పోటీని తిలకించేందుకు ఐస్ ఫ్యాక్టరీ జంక్షన్ సమీపంలో ఉన్న మైదానంలో భారీ ఎల్ఇడి స్క్రీన్ ఏర్పాటు చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, జిల్లా అధికారులు పాల్గొంటారని తెలిపారు. జిల్లా కేంద్రంలోని ప్రజలతో పాటు సమీప గ్రామాల ప్రజలు క్రికెట్ అభిమానులు పాల్గొని భారత జట్టు మద్దతు తెలపాలని కోరారు. క్రికెట్ మ్యాచ్ వీక్షణకు ఎటువంటి ప్రవేశ రుసుము లేదని తెలిపారు. భారీ ఎల్ఇడి స్క్రీన్‌తో పాటు డిజె సౌండ్, లైటింగ్, ఫుడ్ కోర్టులు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో విజయనగరం జిల్లా క్రికెట్ అసోసియేషన్ సెలెక్టర్ వర్మ కోచ్ సురేందర్, రమేష్ చంద్రశేఖర్, క్రీడాకారులు పాల్గొన్నారు.

ఎగ్జిబిషన్ మైదానంలో ఏర్పాట్లను పరిశీలిస్తున్న డిసిఎ కార్యదర్శి రాజు

ధర్నాలో పాల్గొన్న సిపిఎం జిల్లా కార్యదర్శి తమ్మినేని సూర్యనారాయణ, నాయకులు, ప్రజలు

రోడ్లు బాగుచేయాలని సిపిఎం ధర్నా

ప్రజాశక్తి-కొత్తవలస

కొత్తవలస మండల కేంద్రంలో మూడు రోడ్లు గుంతలమయం అయ్యాయని, వెంటనే బాగుచేయాలని కోరుతూ శనివారం సిపిఎం ఆధ్వర్యాన ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా సిపిఎం జిల్లా కార్యదర్శి తమ్మినేని సూర్యనారాయణ మాట్లాడుతూ కొత్తవలసలో రోడ్లు పూర్తిగా ధ్వంసం అయ్యాయని చెప్పారు. ప్రతిరోజూ వాహన చోదకులు ఇబ్బందులు పాలవుతున్నారని ఆందోళన వ్యక్తంచేశారు. గుంతల వల్ల రోడ్డు ప్రమాదాలు అధికంగా సంభవిస్తున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ రోడ్ల విషయాన్ని పాలకులు, అధికారులు విస్మరించడం ఆందోళన కలిగిస్తోందన్నారు. వాటిని రోడ్లు బాగుచేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సిపిఎం జిల్లా నాయకులు గాడి అప్పారావు, తదితరులు పాల్గొన్నారు.

ఖోఖో కోచింగ్ క్యాంప్ ప్రారంభం

విజయనగరం టౌన్ : జిల్లా ఖో ఖో అసోసియేషన్ ఆధ్వర్యంలో రాజీవ్ క్రీడా మైదానంలో సబ్ జూనియర్స్ ఖోఖో ప్రాబబుల్ ఎంపిక జరిగింది. శనివారం నుండి 25వ తేదీ వరకు విజయనగరం నేషనల్ స్కూల్‌లో కోచింగ్ క్యాంపు శనివారం నుంచి ప్రారంభం అయ్యింది. స్కూల్ కరస్పాండెంట్ బి. రామారావు ఈ క్యాంపును ప్రారంభించారు. 24వ తేదీ వరకు క్యాంపు నిర్వహించి, 25న గుంటూరు జిల్లా నరసరావుపేటలో జరిగే సబ్ జూనియర్స్ స్టేట్ ఛాంపియన్ షిప్ పోటీల్లో పాల్గొంటారు. వీరందరికీ నేషనల్ స్కూల్ యాజమాన్యం వసతి, భోజన సదుపాయం కల్పిస్తోంది. జిల్లా ఖోఖో అసోసియేషన్ చైర్మన్ చిన్నంనాయుడు, కార్యదర్శి సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

కౌలురైతులందరికీ పంట రుణాలివ్వాలి

విద్యాదీవెన, వసతి దీవెన కోసం సంయుక్త ఖాతాలు తెరవాలి ● జిల్లా స్థాయి బ్యాంకర్ల సమావేశంలో కలెక్టర్

ప్రజాశక్తి-విజయనగరం

జిల్లాలో కౌలురైతు గుర్తింపు కార్డు (సిసిఆర్‌సి)లు కలిగి వున్నకౌలు రైతులందరికీ వచ్చే రబీ సీజనులో పంట రుణాలు మంజూరు చేయాలని కలెక్టర్ ఎస్.నాగలక్ష్మి బ్యాంకు అధికారులను ఆదేశించారు. ఖరీఫ్‌లో ఆశించిన స్థాయిలో రుణాలు ఇవ్వలేక పోయినందున రబీలోనైనా కౌలు రైతులకు రుణాలు మంజూరు చేయాలన్నారు. జిల్లాలో 12,734 మంది కౌలు రైతులకు సిసిఆర్‌సి కార్డులను జారీ చేయగా వీరిలో 1,115 మందికి రూ.3.62 కోట్లు మాత్రమే జిల్లాలోని అన్ని బ్యాంకులు కలసి ఖరీఫ్ సీజనులో రుణాలు ఇచ్చాయని, మిగిలిన వారికి రబీ పంటలకు గాను రుణాలు ఇవ్వాల్సిందేనని స్పష్టంచేశారు. జిల్లా స్థాయి బ్యాంకర్ల సమన్వయ కమిటీ సమావేశం కలెక్టర్ ఎస్.నాగలక్ష్మి అధ్యక్షతన శనివారం జరిగింది. ఈ సందర్భంగా సెప్టెంబరుతో ముగిసిన రెండో త్రైమాసికం అనంతరం బ్యాంకుల వార్షిక రుణప్రణాళిక అమలులో సాధించిన ప్రగతిని బ్యాంకుల జిల్లా స్థాయి అధికారులు, వివిధ ప్రభుత్వ శాఖల అధికారుల సంయుక్త సమావేశంలో కలెక్టర్ సమీక్షించారు.

జిల్లా వ్యవసాయ ప్రధానమైన ప్రాంతమైనందున జిల్లాలో వ్యవసాయ అనుబంధ పరిశ్రమల ఏర్పాటుకు అధికంగా అవకాశాలు వున్నాయని, ఆహార ఉత్పత్తుల శుద్ధి పరిశ్రమల ఏర్పాటుకోసం అమలు చేస్తున్న కేంద్ర పథకం పిఎంఎఫ్ఎంఇ ద్వారా జిల్లాకు కేటాయించిన లక్ష్యం మేరకు యూనిట్లను ఏర్పాటు చేయడంలో ఉద్యాన శాఖ, డిఆర్‌డిఎ, బ్యాంకులు కలసి పని చేయాలన్నారు. ఈ పథకంలో 270 యూనిట్లను ఏర్పాటు చేయాల్సి వుండగా ఇప్పటివరకు 49 మాత్రమే ఏర్పాటు చేశామన్నారు.

జగనన్న తోడు పథకం ద్వారా అర్హులైన లబ్దిదారులకు రుణాలు అందించే ప్రక్రియను 15 రోజుల్లోగా పూర్తిచేయాలని కోరారు. టిడ్కో ఇళ్ల లబ్దిదారులకు రుణాలు మంజూరు చేయడంలో వున్న సమస్య పరిష్కారంపై రిజిస్ట్రేషన్లు, మెప్మా, బ్యాంకుల అధికారులతో సంయుక్త సమావేశం ఏర్పాటు చేస్తామన్నారు.

బ్యాంకర్ల సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ నాగలక్ష్మి

విద్యాదీవెన, వసతి దీవెన కోసం 24లోగా సంయుక్త ఖాతాలు తెరవాలి

రాష్ట్ర ప్రభుత్వం బిసి, ఎస్‌సి, ఎస్‌టి, మైనారిటీ విద్యార్థులకు జగనన్న విద్యాదీవెన, వసతి దీవెన కార్యక్రమాల ద్వారా అందిస్తున్న ఆర్థిక సహాయాన్ని జమ చేసేందుకు విద్యార్థులు, వారి తల్లులకు కలసి ఉమ్మడి ఖాతాలు తెరవడంలో అన్ని బ్యాంకులు సహకరించాలని జిల్లా కలెక్టర్ కోరారు. ఈనెల 24వ తేదీ లోగా బ్యాంకు ఖాతాలు తెరిచే కార్యక్రమం పూర్తిచేయాలని సూచించారు. నవంబరు మూడో వారంలో జిల్లాలో జరిగే వికసిత్ భారత్ సంకల్పయాత్రలో బ్యాంకర్లు పాల్గొనాలని కలెక్టర్‌సూచించారు.

వార్షిక రుణ ప్రణాళికలో 70శాతం లక్ష్యాల సాధన

జిల్లాలో ప్రస్తుత ఆర్థిక సంవత్సరానికి సంబంధించి రూపొందించిన రుణ ప్రణాళికలో రెండో త్రైమాసికం ముగిసే (సెప్టెంబరు మాసంతం) నాటికి 70.05శాతం లక్ష్యాలను సాధించినట్లు లీడ్ డిస్ట్రిక్ట్ మేనేజర్ శ్రీనివాసరావు చెప్పారు. రూ.9,064 కోట్లకు గాను రూ.6,349 కోట్లు ఇప్పటివరకు వివిధ రంగాలకు బ్యాంకులు రుణాలను అందించాయన్నారు. ఇందులో పంటరుణాల లక్ష్యం 60శాతం సాధించినట్లు తెలిపారు. సమావేశంలో ఆర్‌బిఐ ఎల్‌డిఒ రెహమాన్, యూనియన్ బ్యాంకు ప్రాంతీయ మేనేజర్ మాధవి, ఎపిజివిబి ప్రాంతీయ మేనేజర్ రామకృష్ణరాజు, డిఆర్‌డిఎ ప్రాజెక్టు డైరక్టర్ కళ్యాణ్ చక్రవర్తి, మెప్మా పీడీ సుధాకర్, వ్యవసాయ శాఖ జెడి విటి రామారావు, పశుసంవర్ధక శాఖ జెడి విశ్వేశ్వరరావు, సాంఘికసంక్షేమ అధికారి రామానందం, గిరిజన సంక్షేమ అధికారి చంద్రశేఖర్, ఎపిఎంఐపి పీడీ లక్ష్మీనారాయణ, పరిశ్రమల కేంద్రం జనరల్ మేనేజర్ పాపారావు, మత్స్యశాఖ డిడి నిర్మలాకుమారి, ఉద్యానశాఖ డిడి జమదగ్ని తదితరులు పాల్గొన్నారు.

8 నుంచి అంగన్వాడీల సమ్మె

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

అంగన్వాడీ వర్కర్స్, ఆయాల సమస్యలు పరిష్కారం కోసం డిసెంబర్ 8 నుంచి సమ్మె చేయనున్నట్లు ఎపి అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ నాయకులు తెలిపారు. శనివారం ఐసిడిఎస్ పీడీ బి.శాంతకుమారికి సమ్మె నోటీసు అందజేశారు. ప్రధానంగా అంగన్వాడీ సమస్యలు పరిష్కారం చేయాలని నాలుగున్నరేళ్లగా అనేక పోరాటాలు చేశామని, అయినా ప్రభుత్వం పరిష్కరించలేదని తెలిపారు. తెలంగాణ కంటే అదనంగా జీతం పెంచి ఇవ్వాలని, సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పు ప్రకారం గ్రాడ్యుటీ అమలు చేయాలని, పెన్షన్‌తో కూడిన రిటైర్మెంట్ బెనిఫిట్ టీచర్లకు ఐదు లక్షలు, హెల్పర్‌కు మూడు లక్షలు ఇవ్వాలని, 300 జనాభా దాటిన మినీ వర్కర్‌ను మెయిన్ వర్కర్ గా మార్చాలని, సంక్షేమ పథకాలు అమలు చేయాలని, ఎఫ్ఆర్ ఎస్ఇ యాప్‌ను రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ డిసెంబర్ 8 నుంచి రాష్ట్రవ్యాప్తంగా సమ్మెకు వెళ్తున్నామని, 20న ప్రాజెక్ట్ స్థాయిలో ధర్నా చేసి పిఒలకి వినతులు ఇస్తామని తెలిపారు.

సమ్మెకు ప్రజలు, లబ్ధిదారులు, ప్రజా సంఘాలు, రాజకీయ పార్టీలు మద్దతు తెలియజేయాలని కోరారు. కార్యక్రమంలో అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ రాష్ట్ర ఉపాధ్యక్షులు ఎం.ఉమామహేశ్వరి, జిల్లా ప్రధాన కార్యదర్శి ఎస్.అనసూయ, జిల్లా అధ్యక్షులు బి.పైడిరాజు, గౌరవ అధ్యక్షులు వి.లక్ష్మి, ప్రభ, కృష్ణమ్మ, సరళ, మంగ లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.



ఐసిడిఎస్ పీడీకి సమ్మె నోటీసు అందజేస్తున్న అంగన్వాడీ యూనియన్ నాయకులు

'అడ్డగోలు మాటలొద్దు'

విజయనగరం కోట : టిడిపి పొలిట్‌బ్యూరో సభ్యులు పి.అశోక్‌గజపతిరాజుపై జెడ్‌పి చైర్మన్ శ్రీనివాసరావు అడ్డగోలు మాట్లాడడం సరికాదని టిడిపి నగర అధ్యక్షులు ప్రసాదుల లక్ష్మీ వరప్రసాద్ అన్నారు. శనివారం టిడిపి కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ నోటికి ఏది వస్తే అది మాట్లాడడం తగదని, ఎవరు మతిపోయి మాట్లాడుతున్నారో ప్రజలు గమనిస్తున్నారని అన్నారు. చంద్రబాబు నాయుడును స్కిల్ డెవలప్‌మెంట్ కేసు లో అడ్డగోలుగా అరెస్టు చేసి 52రోజులు జైల్లో ఉంచి ఎటువంటి ఆధారాలు నిరూపించుకోలేక పోయారని అన్నారు. జిల్లా పరిషత్ చైర్మన్ పదవి రిజర్వేషన్ కోటాలో ఎస్‌టి మహిళకు వస్తే దాన్ని మార్చి అడ్డగోలుగా చైర్మన్ పదవిలోకి వచ్చింది ఎవరో తెలుసుకోవాలన్నారు. సమావేశంలో మండల టిడిపి కార్యదర్శి గంటా పోలినాయుడు, పట్టణ కార్యదర్శి బంగారు బాబు, కార్యాలయం కార్యదర్శి రాజేష్ బాబు తదితరులు మాట్లాడారు.

బాలల హక్కులు అందరికీ తెలియాలి

విజయనగరం : బాలల హక్కుల గురించి బాలలకు, సమాజానికి తెలియజేయవలసిన అవసరం ఉందని జిల్లా కలెక్టర్ నాగలక్ష్మి తెలిపారు. బాలలు తమ బాల్యాన్ని అనుభవిస్తూనే నచ్చిన రంగం లో ఎదగాలని పిలుపునిచ్చారు. కలెక్టరేట్ ఆడిటోరియంలో శనివారం బాలల హక్కుల పరిరక్షణ కమిషన్, ఐసిడిఎస్, బెజ్జిపురం యూత్ క్లబ్ , కైలాష్ సత్యర్థి చిల్డ్రన్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో బాలల హక్కుల వారోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఆడ పిల్లల చదువు తల్లి దండ్రులకు ఆటంకం కాకూడదనే ఉద్దేశంతోనే ప్రభుత్వం ఉన్నత విద్య వరకు డిబిటి పథకం ద్వారా నగదు చెల్లించే అనేక పథకాలను అమలు చేస్తోందని తెలిపారు. బాల్య వివాహాలను జరిపే తల్లి దండ్రుల పైన, వివాహానికి ఏర్పాట్లు చేసేవారి పైన, పురోహితులు ఆఖరికి బాల్య వివాహాలకు హాజరయ్యే అతిధుల పైన కూడా కేసు బుక్ చేయాలని కలెక్టర్ ఆదేశించారు. అనంతరం బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ చైర్మన్ కేసలి అప్పారావు మాట్లాడారు.

కరువు కహానీలు

ప్రజాశక్తి - విజయనగరం ప్రతినిధి

నిజం వేరు... నమ్మకం వేరు... ఈ రెండు పదాలూ దాదాపు ఒకే అర్థాన్ని ఇచ్చేలా ప్రతిధ్వనిస్తున్నప్పటికీ, భౌతిక పరిస్థితులకు అనుగుణంగా ఆలోచించేవారికి వీటి మధ్య వున్న తీవ్రమైన వ్యతాసం ఉందని తెలుస్తుంది. ఇంకా చెప్పాలంటే నిజం నిప్పులాంటిది. నిరూపనకు సాధ్యమౌతుంది. నమ్మకం అనేది నిజాన్ని పోలి ఉంటుంది. నిజంపై ఆధారపడి ఉంటుంది. కానీ, నిరూపనకు సాధ్యం కాదు. ప్రస్తుతం మన జిల్లాలో కరువు ఉందా? లేదా అని చెప్పాలంటే భౌతిక పరిస్థితులను అర్థం చేసుకున్న వారికే సాధ్యమౌతుంది. లేదంటే నిబంధనలు అనే నమ్మకంతో కళ్లెదురుగా కరువు కూడా కానరాకుండానే పోతుంది. తాజాగా అధికారులు, ప్రభుత్వం చూపుతున్న లెక్కలు కూడా ఇందుకు అర్థం పడతున్నాయి. నిబంధనల ప్రకారం జిల్లాలో కరువు లేదంటున్నారు జిల్లాలోని ప్రజాప్రతినిధులు, అధికారులు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలూ తమకు పటనట్టుగా వ్యవహరిస్తున్నాయి. కరువు ప్రతిపాదనపై వీరంతా చెబుతున్న నిబంధనల ప్రకారం జూన్ నుండి సెప్టెంబర్ నెల వరకు ఖరీఫ్ కాలంగా పరిగణంలోకి తీసుకోబడుతుందట. ఈ వాదనను ఒక్కసారి పరిశీలిస్తే... ప్రస్తుత ఖరీఫ్‌లో జిల్లా వ్యాప్తంగా వ్యవసాయ, ఉద్యాన పంటలకు కలిపి సాధారణ విస్తీర్ణం 4.21 లక్షల ఎకరాలు కాగా, సెప్టెంబర్ 30 నాటికి 3.53 లక్షల ఎకరాలు(84శాతం) మాత్రమే సాగయ్యాయి. ఆ తరువాత మరో 11శాతం పెరిగింది. ఈలెక్కన మొత్తం ఇప్పటి వరకు 3.90లక్షల ఎకరాలు (93శాతం) వరకు సాగైంది. పంటలు తీవ్రంగా ఎండిపోవడంతో పాటు నెల తేమశాతం, భూగర్భ జలాల తగ్గడం, రిమోట్ సెన్సింగ్, పశువులకు గడ్డి, దాణా దొరక్క పోవడం వంటి పరిస్థితులు ఎదురైతేనే కరువుగా గుర్తిస్తారట. జిల్లాలో ఖరీఫ్



ఈఏడాది జూన్ నుండి సెప్టెంబర్ వరకు సాధారణ వర్షపాతం నమోదైంది. మిగిలిన అంశాల్లోనూ కరువు నిబంధనలకు అనుగుణంగా లేవు. ఇది అధికారులు, ప్రభుత్వ వాదన. కానీ, భౌతిక పరిస్థితులు పరిశీలిస్తే ప్రభుత్వ వాదన ఏమాత్రం సరికాదన్నది స్పష్టంగానే అర్థమౌతుంది. నిజం ఏమంటే ఖరీఫ్ కాలంగా భావిస్తున్న జూన్ నుంచి అక్టోబర్ వరకు సాధారణ వర్షపాతం నమోదైంది. కానీ, అన్ని నెలల్లోనూ ఒకే విధంగా లేదు. హెచ్చుతగ్గుల కారణంగా సకాలంలో వరి నారుపోత పూర్తి కాలేదు. ఇంత పంటలకూ ఆలస్యమైంది. దీనికితోడు పడిన వర్షపునీరు కూడా సముద్రం పాలైంది. ఎందుకంటే మన జిల్లాలో పెద్దగా సాగునీటి ప్రాజెక్టులు లేవు. తోటపల్లి కాలువలు పూర్తికాకపోవడం వల్ల లక్ష్యానికి అనుగుణంగా నీరు అందించడం లేదు. ఇక తారక రామతీర్థసాగర్ నిర్మాణ పనులే పూర్తికాలేదు. గుర్ల గెడ్డకు అతీగతి లేదు. పెద్దగెడ్డ, ఆంద్ర, తాటిపూడి తదితర జలాశయాల నిర్వహణ కూడా అధ్వానంగా ఉండడంతో చివరి ఆయుకట్టుకు సాగునీరు అందడం లేదు. ఫలితంగా నాట్లు పడినప్పటికీ సాగునీరు అందక పంట పొలాలు ఎండిపోయాయి. మొత్తానికి పంట నాశనమైంది. ఇది నిజం అని చెప్పడానికి పొలాలను పరిశీలిస్తే తెలిసిపోతుంది. దీన్ని పక్కనబెట్టి వర్షపాతాన్ని, భూగర్భ జలాలను ఇతర అంశాలను ఎత్తిచూపడం ముమ్మాటికీ కరువు సాయాన్ని ఎగ్గొట్టడం కోసమేనని రైతులు, వ్యవసాయ కార్మికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా మన జిల్లాకు చెందిన పాలకులు భౌతిక కోణంలో ఆలోచించి, చర్చించి, మరోసారి కల్లుపెద్దవి చేసి చూస్తే రైతుల ఇతి బాధలు, కరువు కష్టాలు కనిపిస్తాయని జనం చర్చించుకుంటున్నారు.

సౌత్‌జోన్ పోటీలకు 'అవంతి' విద్యార్థిని

ప్రజాశక్తి-గరివిడి

అవంతీస్ సెయింట్ థెరిసా ఇంజినీరింగ్ కాలేజీ విద్యార్థిని కారు కీర్తి సౌత్‌జోన్ స్థాయి వాలీబాల్ పోటీలకు ఎంపికైంది. ఈ సందర్భంగా ప్రిన్సిపల్ డాక్టర్ వి.జాషువ జయప్రసాద్ ఆ విద్యార్థిని అభినందించారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపల్ బి.వెంకటరమణ, ఎఒ జి.అనిల్‌కుమార్, కాలేజీ వ్యాయామ ఉపాధ్యాయులు ఎం.ఈశ్వరరావు,పి. ధనుంజయ్ పాల్గొన్నారు.

భారీ వాహనాలతో దెబ్బతిన్న పైపులైన్

బొబ్బిలి : భారీ వాహనాలు రాకపోకలు సాగించడంతో మున్సిపల్ పైపులైన్ దెబ్బతింది. పైపులైన్ పాడైపోవడంతో లీకులతో తాగునీరు వృధాగా పోతుంది. బలిజిపేట రోడ్డులో చినబజారు జంక్షన్‌లో పైపులైన్ లీకులతో తాగునీరు వృధాగా పోయింది. దీంతో స్పందించిన మున్సిపల్ అధికారులు లీకులను నివారించేందుకు చర్యలు చేపట్టారు. పారాది వంతెన పాడైపోవడంతో భారీ వాహనాలు రాకపోకలు పట్టణంలో నుంచి సాగడంతో పైపులైన్ పాడైపోతుందని మున్సిపల్ కమిషనర్ ఎస్.శ్రీనివాసరావు చెప్పారు. మరమ్మతులను మున్సిపల్ డిఇ రవికుమార్ పర్యవేక్షించారు.

బిఎల్ఒల పనితీరుపై ఆర్‌డిఒ ఆగ్రహం

ప్రజాశక్తి-మెరకముడిదాం

మండలంలోని బిఎల్ఒలపై ఆర్‌డిఒ బి.ప్రశాంతి ఆగ్రహం వ్యక్తం చేశారు. శనివారం స్థానిక తహశీల్దార్ కార్యాలయంలో నిర్వహించిన బిఎల్ఒల సమావేశంలో ఆమె పాల్గొన్నారు. మండలంలో ఓటర్ల జాబితాల్లో మరణించిన, డబుల్ ఎంట్రీ ఓటర్లను తొలగించాలని వారం క్రితం జరిగిన సమావేశంలో తెలియజేశారు. ఇంతవరకూ వాటిని తొలగించకపోవడంపై ఆర్‌డిఒ ఆగ్రహం వ్యక్తం చేశారు. కొంతమంది బిఎల్ఒలు ఆయా జాబితాలపై ఇంతవరకు దృష్టిసారించక పోవడంపై మండిపడ్డారు. ఒకానొక సమయంలో వారి పని తీరుపై షోకాజ్ నోటీసులు జారీ చేస్తామని హెచ్చరించారు. పని చేయడానికి వచ్చారా? లేదా కాలక్షేపం కోసం వచ్చారా? అని తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. సమావేశంలో తహశీల్దార్ విజయభాస్కర్, ఎలక్షన్ డిటి బి.సురేష్, హెచ్‌డిటి గిరిధర్, ఆర్‌ఐ గౌరినాయుడు, సీనియర్ అసిస్టెంట్ నాగమణి పాల్గొన్నారు.

20న మున్సిపల్ కార్మికుల దీక్ష

ప్రజాశక్తి-నెల్లిమర్ల

ఈ నెల 20న కలెక్టరేట్ వద్ద చేపట్టే మున్సిపల్ కార్మికుల నిరసన దీక్ష జయప్రదం చేయాలని ఆ యూనియన్ కార్యదర్శి బాబూరావు కోరారు. శనివారం స్థానిక మొయిద జంక్షన్‌లో నిరసన దీక్ష పోస్టర్ విడుదల చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ పాదయాత్రలో సిఎం జగన్మోహన్ రెడ్డి ఇచ్చిన హామీని నాలుగున్నరేళ్లుగా నెరవేర్చకపోవడం దారుణమన్నారు. ఇప్పటికైనా ఇచ్చిన మాటను నిలబెట్టుకోకపోతే తగిన మూల్యం చెల్లించుకోక తప్పదని హెచ్చరించారు. ఇంజనీరింగ్ కార్మికులకు, డ్రైవర్లకు రిస్క్ అలవెన్స్, సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని డిమాండ్‌చేశారు. నెల్లిమర్ల నగర పంచాయతీ కార్మికరాలుగా విధులు నిర్వహిస్తూ మరణించిన తుపాకుల రమణమ్మ కుటుంబంలో ఒకరికి ఉద్యోగం నిమిత్తం కౌన్సిల్లో తీర్మానించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో దుర్గారావు, శ్రీను, హరి, లక్ష్మి పాల్గొన్నారు.

జిపిఎస్ వాహనాలతోనే ధాన్యం రవాణా

ప్రజాశక్తి - జామి

ఈ ఏడాది ధాన్యం రవాణా చేయాలంటే కచ్చితంగా వాహనాలకు జిపిఎస్ ట్రాకింగ్ యంత్రాలు అమర్చాలని ఎఒ కిరణ్‌కుమార్ తెలిపారు. శనివారం స్థానిక ఎంపిడిఒ కార్యాలయంలో వ్యవసాయాధికారి కిరణ్ కుమార్ అధ్యక్షతన ధాన్యం కొనుగోలు ప్రక్రియపై శిక్షణ నిర్వహించారు. ఇందులో ప్రధానంగా రవాణా చేసే వాహనాలు తప్పనిసరిగా జిపిఎస్ అమర్చుకోవాలని సూచించారు. ఒక్కో జిపిఎస్ పరికరానికి రూ.2,470 ఖర్చవుతుందని వెల్లడించారు. ఒకవేళ సివిల్ సప్లయి అధికారులు అమర్చాలని భావిస్తే, జిఎస్‌టి కలుపుకొని రూ.2,970 భరించాల్సి వస్తుందని తెలిపారు. ఈ నేపథ్యంలో ప్రతి రైతు భరోసా కేంద్రాన్ని కొనుగోలు కేంద్రంగా మారుస్తామన్నారు.

సిఎస్‌సి అకాడమీతో 'అవంతి' ఒప్పందం

ప్రజాశక్తి-భోగాపురం

భారత ప్రభుత్వ నైపుణ్యాభివృద్ధి సంస్థ సిఎస్‌సి అకాడమీతో తగరపువలస అవంతి ఇంజినీరింగ్ కాలేజీ అవగాహన ఒప్పందం కుదుర్చుకున్నట్లు ప్రిన్సిపల్ బి.మురళీకృష్ణ తెలిపారు. దీని వల్ల విద్యార్థులు పరిశోధన అభివృద్ధి, సాంకేతిక నైపుణ్యాలపై పట్టు సాధించేందుకు ఉపయోగపడుతుందని చెప్పారు. దీనిపై కళాశాల డైరెక్టర్ డాక్టర్ చంద్రశేఖర్, అధ్యాపకులు హర్షం వ్యక్తం చేశారు.

మండల అధికారులతో సమీక్ష

ప్రజాశక్తి-వేపాడ

స్థానిక ఎంపిడిఒ కార్యాలయంలో మండల ప్రత్యేక అధికారి లక్ష్మీనారాయణ మండల స్థాయి అధికారులతో శనివారం సమీక్షించారు. సమావేశంలో ఇంతవరకు ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలపై శాఖల వారీగా వివరాలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం అధికారులకు ఆయన పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో ఎంపిడిఒ బిఎస్‌కెఎన్ పట్నాయక్, తహశీల్దార్ కె.ప్రసన్నకుమార్, పంచాయతీరాజ్ శాఖ ఇంజనీర్ ఆలీ, ఆర్‌డబ్ల్యుఎస్ జెఇ దేవి, వేపాడ పిహెచ్‌సి వైద్యాధికారి ధరణి, తదితరులు పాల్గొన్నారు.

బాబు షూరిటీ.. భవిష్యత్తుకు గ్యారంటీ

ప్రజాశక్తి-దత్తి రాజేరు

మండలంలో కోమటిపల్లి, కె.కొత్తవలస, మరడాంలో శనివారం టిడిపి మాజీఎమ్మెల్యే కెఎ నాయుడు ఆధ్వర్యాన 'బాబు ష్యూరిటీ..భవిష్యత్తు గ్యారెంటీ' కార్యక్రమం నిర్వహించారు. ఇంటింటికీవెళ్లి టిడిపి మేనిఫెస్టోను వివరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలుగుదేశం పార్టీ అధికారంలోకి వస్తే మహాశక్తి, తల్లికి వందనం, దీపం పథకం, మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, యువతకు ఉద్యోగ ఉపాధి అవకాశాలు కల్పించడం జరుగుతుందన్నారు. రాష్ట్ర ప్రగతిని పరుగులు పెట్టించేందుకు ఈ పథకాలు దోహదపడతాయని అన్నారు. వైసిపి పాలనంతా అవినీతి అక్రమాల మయం అయ్యిందని అన్నారు. కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షులు పెద్దింటి మోహన్ రావు, నాయకులు పివివి గోపాల రాజు, బొండపల్లి మాజీ జెడ్‌పిటిసి బండారు బాలాజీ, నాయకులు, శీర రామారావు, పలువురు నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

నర్సిపల్లిమెట్టలో ఎంపిడిఒ పర్యటన

ప్రజాశక్తి-వేపాడ

మండలంలోని సోంపురం సచివాలయ పరిధిలోని నర్సిపల్లిమెట్టలో ఎంపిడిఒ బిఎస్‌కెఎన్ పట్నాయక్ శనివారం పర్యటించారు. ఇక్కడ నివశిస్తున్న వలస కూలీల కుటుంబాలకు కనీస సౌకర్యాలు లేకపోవడంతో సామాజిక కార్యకర్త ఆర్.అప్పారావు.. జగనన్నకు చెబుదాంలో కలెక్టర్‌కు వినతి అందించారు. కలెక్టర్ స్పందించి చర్యలు తీసుకోవాలని ఎంపిడిఒను ఆదేశించారు. ఈ మేరకు ఎంపిడిఒ నర్సిపల్లిమెట్టలో పర్యటించి, స్థానికులతో మాట్లాడారు. వారి సమస్యలు తెలుసుకొని నివేదిక తయారు చేశారు. పిల్లలకు మినీ అంగన్వాడి అవసరమని గుర్తించారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి బి.నాగమణి, విఆర్ఒ అప్పలరాము, ఎఎన్ఎం స్వప్న, వెల్ఫేర్ అసిస్టెంట్ నారాయణ, కానిస్టేబుల్ లక్ష్మి, ఆశా వర్కర్ వసంత, వాలంటీర్ భవాని పాల్గొన్నారు.

విద్యా ప్రమాణాలు మెరుగుపరచాలి

ప్రజాశక్తి-రేగిడి

పాఠశాల విద్యార్థులకు విద్యా ప్రమాణాలు మెరుగుపరచాలని డిప్యూటీ డిఇఒ టి.బ్రహ్మాజీ అన్నారు. శనివారం రేగిడి మండల కేంద్రంలో ఉపాధ్యాయులకు ఎడబ్ల్యుపి శిక్షణ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులకు నెలవారి పాఠ్యాంశాలు పూర్తిచేయాలన్నారు. సమయపాలన పాటించి సృజనాత్మక విద్యను అందించాలన్నారు. వెనుకబడిన విద్యార్థులకు ప్రత్యేక తరగతులు నిర్వహించాలని సూచించారు. అకడమిక్ కేలెండర్‌ను అనుసరించి పాఠ్యాంశాలు బోధించాలని సూచించారు. ప్రతిఒక్కరూ క్రమం తప్పకుండా సమయపాలన పాటించాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఎంఇఒలు వరప్రసాదరావు, ఎరకయ్య, స్కూల్ కాంప్లెక్స్ చైర్మన్ రేగిడి లక్ష్మణరావు, రిసోర్స్ పర్సన్ చుక్క వైకుంఠరావు, తదితరులు పాల్గొన్నారు.

దాడులపై ఎస్‌సి, ఎస్‌టి ఐక్యవేదిక ఆందోళన

ప్రజాశక్తి-నెల్లిమర్ల

దళితులపై జరుగుతున్న దాడుల పట్ల ఎస్‌సి, ఎస్‌టి ఐక్యవేదిక నాయకులు శనివారం స్థానిక రామతీర్థం జంక్షన్‌లో ఆందోళన చేపట్టారు. అంబేద్కర్ విగ్రహానికి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఐక్య వేదిక నాయకులు కనిగిరి శ్రీనివాసరావు, టి.నరసయ్య మాట్లాడుతూ వైసిపి అధికారంలోకి వచ్చిన నాలుగున్నరేళ్లలో నిత్యం ఎక్కడో ఒకచోట దళితులపై దాడులు జరుగుతూనే ఉన్నాయని ఆవేదన వ్యక్తంచేశారు. అట్రాసిటీ చట్టం సక్రమంగా అమలు చేయకపోవడం వల్ల దాడులు మరింత పెరిగిపోతున్నాయని ఆరోపించారు. దాడులకు పాల్పడిన వారిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఐక్య వేదిక నాయకులు డి.గోవింద, డానియేలు, పి.శ్రీనివాసరావు, కె.జాన్, టి.పైడి రాజు, రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

'వెలమ'ను బిసి-ఎలో చేర్చాలి

ప్రజాశక్తి-వేపాడ

వెలమ సామాజిక తరగతిని బిసి-ఎలో చేర్చాలని వెలమ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షులు లగుడు గోవిందరావు డిమాండ్ చేసారు. శనివారం వేపాడ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. అన్నివిధాలా వెలమ సామాజిక తరగతికి జరుగుతున్న అన్యాయాన్ని సరిదిద్దాల్సిన తరుణం ఆసన్నమైందన్నారు. వెలమ సామాజిక భవనాలకు అన్ని జిల్లాల్లో స్థలాలు కేటాయించాలని కోరారు. ఈనెల 26న విశాఖపట్నం వేదికగా నిర్వహించాల్సిన వెలమ గర్జన కార్యక్రమాన్ని వచ్చే ఏడాది జనవరి 7వ తేదికి వాయిదా వేసినట్లు ప్రకటించారు.

వరిలో పంట కోత ప్రయోగాలు

ప్రజాశక్తి-కొత్తవలస

మండలంలో చిన్నిపాలెంలో ఎఒ మాధురి శరణ్య, ఎఎస్ఒ సన్యాసిరావు ఆధ్వర్యాన శనివారం పంటకోత ప్రయోగాలు చేపట్టారు. అనంతరం ఎఒ మాధురి మాట్లాడుతూ మండలంలో 36 పంట కోత ప్రయోగాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో వ్యవసాయ సహాయకులు అశ్విని పాల్గొన్నారు.

అధ్వాన రోడ్లపై నిరసన

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

గుంతల ఆంధ్రప్రదేశ్‌కి దారేది పేరుతో జనసేన, టిడిపి ఆధ్వర్యాన శనివారం సుంకరిపేట, దుప్పాడ, చిల్లపేట రోడ్లపై నిరసన తెలిపారు. మండలంలోని పలు గ్రామాల మధ్య ఉన్న అంతర్గత రహదారులు అధ్వానంగా తయారయ్యాయని జనసేన నాయకులు గురాన అయ్యలు అన్నారు. గోతులు పడ్డ రోడ్ల వల్ల తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని, తక్షణమే రోడ్లకు మరమ్మతులు చేయించి అవసరమైన చోట కొత్త రోడ్ల నిర్మాణం చేపట్టాలని కోరారు. పాడైపోతున్న రోడ్లకు మరమ్మత్తులు చేయరా అంటూ పాలకులు, అధికారుల వైఖరిని తప్పుపట్టారు. ప్రమాదాలు జరిగితే కానీ స్పందించరా అంటూ ప్రశ్నించారు. వైసిపి పాలకులు కళ్లకు గంతలు కట్టుకున్నారని, వాళ్లకు రోడ్లపై పడిన గుంతలు కనిపించడం లేదని విమర్శించారు. జిల్లా లో పేరుకుపోయిన సమస్యలపై టిడిపి-జనసేన కలిసి ఉమ్మడి పోరాటం చేస్తూనే ఉంటామని ప్రకటించారు. ప్రజావంచక ప్రభుత్వాన్ని సాగనంపుతామన్నారు. కార్యక్రమంలో జనసేన నాయకులు కాటం అశ్విని, పి. లక్ష్మి, దుప్పాడ జ్యోతి, టి.రామకృష్ణ, రాజేష్, ఎల్ .రవితేజ తదితరులు పాల్గొన్నారు.

విజయనగరంటౌన్.. రోడ్డుపై గుంతల వద్ద నిరసన తెలుపుతున్న నాయకులు

బొబ్బిలి : మున్సిపాలిటీలో రోడ్ల దుస్థితిపై టిడిపి, జనసేన నేతలు ఆగ్రహం వ్యక్తం చేశారు. శనివారం టిడిపి, జనసేన ఆధ్వర్యంలో పూల్‌బాగ్ రోడ్డుపై నిరసన తెలిపారు. కార్యక్రమంలో జనసేన నియోజకవర్గ ఇన్‌ఛార్జి గిరడ అప్పలస్వామి, టిడిపి పట్టణ అధ్యక్షులు రాంబార్కి శరత్, జనసేన నాయకులు ఎం.ధనంజయ్, బి.దివ్య పాల్గొన్నారు.

గరివిడి : గర్భాం మార్గంలో అధ్వాన స్థితిలో ఉన్న రహదారిపై టిడిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జి కిమిడి నాగార్జున ఆధ్వర్యాన నిరసన చేపట్టారు. కార్యక్రమంలో నాయకులు విసినిగిరి శ్రీనివాసరావు, పైల బలరాం, వెన్నె సన్యాసినాయుడు, దన్నాన రామచంద్రుడు, సారేపాక సురేష్ బాబు, బలగం వెంకటరావు, తదితరులు పాల్గొన్నారు.

కొత్తవలస : కొత్తవలస మండల కేంద్రంలో విజయనగరం వెళ్లే మెయిన్ రోడ్డుపై మాజీ ఎమ్మెల్యే కోళ్ల లలిత కుమారి, జనసేన పార్టీ నియోజకవర్గ ఇన్‌ఛార్జి ఒబ్బిన సత్యనారాయణ ఆధ్వర్యాన మోకాళ్లపై నిలబడి నిరసన చేపట్టారు. ఈ కార్యక్రమంలో టిడిపి రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి కెబిఎ రాంప్రసాద్, నాయకులు కరెడ్ల ఈశ్వరరావు, ఎల్లపు సూరిబాబు, కనకాల శివ, బంగారు రమేష్, బొబ్బిలి అప్పారావు, తిక్కాన చినదేముడు, లెంక శ్రీను, తదితరులు పాల్గొన్నారు.

భోగాపురం : మండలంలోని బమ్మిడిపేట వెళ్లే రహదారిలో టిడిపి, జనసేన నియోజకవర్గ ఇన్‌ఛార్జులు కర్రోతు బంగార్రాజు, లోకం మాధవి ఆధ్వర్యాన నిరసన చేపట్టారు. కార్యక్రమంలో ఇరు పార్టీలకు చెందిన నాయకులు కర్రోతు సత్యనారాయణ, సువ్వాడ రవి శేఖర్, ఆకిరి ప్రసాద్, పతివాడ అప్పలనాయుడు, పల్లంట్ల జగదీష్, పళ్ళ రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

9న జాతీయ లోక్ అదాలత్

రాజాం : వచ్చే నెల 9న ఉదయం 10.30గంటల నుంచి కోర్టు సముదాయంలో జాతీయ అదాలత్ జరుగుతుందని స్థానిక సీనియర్ సివిల్ జడ్జి ఎం.బాబు తెలిపారు. ఈమేరకు శనివారం న్యాయవాదులు, సంబంధిత పోలీసు సిబ్బందితో సీనియర్ సివిల్ జడ్జి బాబు, సివిల్ జడ్జి పిఎస్‌విబి కృష్ణసాయి సమావేశమయ్యారు. అదాలత్‌లో రాజీకి అనుకూలమైన క్రిమినల్ కేసులు, సివిల్ కేసులు, ప్రీ లిటిగేషన్ కేసులు పరిష్కరించుకోవచ్చునని తెలిపారు. సమావేశంలో బార్ అసోసియేషన్ తరపున ఎజిపి ఎస్.పోలారావు, ఎపిపి కె.సూర్యకుమార్, రూరల్ ఎస్ఐ శ్రీనివాస్, టౌన్ ఎస్ఐ పి.నీలావతి, సంతకవిటి ఎస్ఐ లోకేశ్వరరావు పాల్గొన్నారు.

యుటిఎఫ్ మండల కార్యవర్గం ఎన్నిక

గజపతినగరం : యుటిఎఫ్ గజపతినగరం మండల శాఖ అధ్యక్ష కార్యదర్శులుగా ముగడ రమేష్‌బాబు, లెంక జగదీష్ ఎన్నికయ్యారు. శనివారం యుటిఎఫ్ మండల కౌన్సిల్ సమావేశం జరిగింది. తొలుత యుటిఎఫ్ నాయకులు శేషగిరి చిత్రపటం వద్ద నాయకులు నివాళులర్పించారు. అనంతరం రాష్ట్ర కార్యవర్గ సభ్యులు కె.విజయగౌరి మాట్లాడుతూ విద్యారంగ సమస్యల పరిష్కారానికి, ప్రభుత్వం తీసుకొచ్చిన జిపిఎస్‌ను రద్దు చేసి ఒపిఎస్‌ను అమలు చేయాలని డిమాండ్ చేస్తూ పోరాటాలను ఉధృతం చేయాలని పిలుపునిచ్చారు. అనంతరం మండల కార్యవర్గ ఎన్నిక జరిగింది.

లెండి కళాశాలకు అరుదైన పురస్కారం

పురస్కారాన్ని స్వీకరిస్తున్న లెండి కళాశాల యాజమాన్య ప్రతినిధులు

ప్రజాశక్తి-డెంకాడ

మండలంలోని జొన్నాడ వద్దనున్న లెండి ఇంజినీరింగ్ కళాశాలకు అరుదైన పురస్కారం లభించింది. అఖిల భారత విద్యామండలి ఎడ్యు స్కిల్స్ ఇంటర్న్‌షిప్‌లో లెండి కళాశాల ద్వితీయ స్థానం పొందింది. ఆలిండియా స్థాయిలో బెస్ట్ పెర్ఫార్మెన్స్ ఇన్‌స్టిట్యూట్ విభాగంలో ద్వితీయ స్థానాన్ని లెండి కళాశాల కైవసం చేసుకుంది. గోవా ముఖ్యమంత్రి ప్రమోద్ సావంత్, అఖిల భారత విద్యామండలి చైర్మన్ టి.జి.సీతారామన్ కళాశాల యాజమాన్య ప్రతినిధులకు అవార్డును అందజేశారు. ఇటువంటి ఇంటర్న్‌షిప్‌లు రేపటి తరానికి కావాల్సిన డిజిటల్ వర్క్‌ఫోర్స్‌ను పెంపొందించే దిశగా విద్యార్థులను ప్రోత్సహించిందని కళాశాల సెక్రటరీ అండ్ కరస్పాండెంట్ కోడూరు శివరామకృష్ణ, ప్రిన్సిపల్ డాక్టర్ వివి రామరెడ్డి, ప్లేస్‌మెంట్ డీన్ జి.ప్రకాశ్‌బాబు తెలిపారు. గోవాలో జరిగిన కార్యక్రమంలో ఇంటర్న్‌షిప్‌లు విజయవంతంగా నిర్వహించిన సంస్థ అధ్యాపకులు పిజె జగన్నాథవర్మ, డి.మధుబాబు, ఎస్.సురేష్ పాల్గొన్నారు.

కులగణనపై ప్రత్యేక శ్రద్ధ

ప్రజాశక్తి - పూసపాటిరేగ

ఈ నెల 27 నుంచి జరిగే కులగణనపై పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ ఉద్యోగులు ప్రత్యేక శ్రద్ధపెట్టాలని ఎంపిడిఒ ఎం.రాధిక అన్నారు. శనివారం స్థానిక ఎంపిడిఒ కార్యాలయంలో కులగణనపై ఏర్పాటు చేసిన సమావేశంలో ఆమె మాట్లాడారు. కులగణనను సచివాలయ సిబ్బంది, వాలంటీర్లు కలిసి చేయాలన్నారు. ప్రతి ఇంటికీ వెళ్లి వారి కులం నమోదు చేయాలన్నారు. కులం కోసం ఎటువంటి ధ్రువీకరణ పత్రాలు అవసరం లేదన్నారు. 8 ఏళ్లలోపు వారికి కుల నమోదు అవసరం లేదన్నారు. కులగణనపై కొంత మంది ఆందోళన చెందే అవకాశం ఉందని, దీనివల్ల సంక్షేమ పథకాలు ఆగే ప్రసక్తే లేదని స్పష్టంచేశారు. వారం రోజుల్లో మండలమంతా నమోదు జరిగేలా చర్యలు తీసుకోవాలన్నారు. సమావేశంలో జెసిఎస్ కన్వీనర్ మహంతి శ్రీనివాసరావు, తహశీల్దార్ ఐ.బాస్కరరావు, తదితరులు పాల్గొన్నారు.

నెల్లిమర్ల : కులగణన పక్కాగా నిర్వహించాలని తహశీల్దార్ డి.ధర్మరాజు, ఎంపిడిఒ జి.రామారావు సూచించారు. శనివారం స్థానిక ఎంపిడిఒ కార్యాలయంలో కులగణనపై వాలంటీర్లతో శిక్షణ నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మండలంలో 16 సచివాలయాల పరిధిలో వాలంటీర్లు ఇంటింటికి వెళ్లి కుల గణన పక్కాగా చేయాలని సూచించారు. అనంతరం ఆడుదాం ఆంధ్రపై అవగాహన కల్పించారు.

ప్రశాంతంగా ప్రజావేదిక

ప్రజాశక్తి-మెరకముడిదాం

ఉపాధి హామీ పనులకు సంబంధించి స్థానిక ఎంపిడిఒ కార్యాలయం వద్ద శనివారం నిర్వహించిన సామాజిక తనిఖీ ప్రజావేదిక ప్రశాంతంగా సాగింది. 1824 పనులకు రూ.26.96 కోట్లు వెచ్చినట్లు ఎస్ఆర్‌పి మాధవరావు తెలిపారు. ఏ పంచాయతీలో కూడా అవెన్యూ ప్లానిటేషన్ కింద వేసిన మొక్కలు పూర్తి స్థాయిలో లేనట్లు సోషల్ ఆడిట్ అధికారులు తెలిపారు. కార్యక్రమంలో ఎపిడి లక్ష్మణరావు, డివిఒ పి.వెంకటరాజు, ఎడి విఒ వెంకటనాయుడు, ఎపిడి ఎం.శ్రీనివాసరావు, ఎంపిడిఒ ఎం.రత్నం, తాడ్డి వేణుగోపాలరావు, వైస్ ఎంపిపి తలచుట్ల హరిబాబు, మాజీ జెడ్‌పిటిసి కోట్ల వెంకటరావు, డిసిఎంఎస్ మాజీ చైర్మన్ ఎస్‌వి రమణరాజు, కెఎస్ఆర్‌కె ప్రసాద్, ఎపిఒ పెదప్పలనాయుడు పాల్గొన్నారు.

లక్ష్య సాధనకు కృషిచేయాలి

ప్రజాశక్తి-గరివిడి

విద్యార్థులు లక్ష్యాన్ని నిర్దేశించుకుని, సాధనకు కృషి చేయాలని జిఎంఆర్ కళాశాల అసిస్టెంట్ ప్రొఫెసర్ పవన్ సూచించారు. మండలంలోని కాపుశంబాం జిల్లా పరిషత్తు ఉన్నత పాఠశాలలో జిఎంఆర్ వరలక్ష్మి ఫౌండేషన్ సోషల్ వాలంటీర్ ప్రాజెక్టు ఆధ్వర్యంలో విద్యార్థులకు అవగాహన సదస్సు నిర్వహించారు. అనంతరం 150 మంది విద్యార్థులకు నైతిక విలువలు కలిగిన పుస్తకాలను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు డి.రాము, ఉపాధ్యాయులు, ప్రాజెక్టు మేనేజర్ రెడ్డి రమణ, విద్యార్థులు పాల్గొన్నారు.

సక్రమంగా రికార్డుల నిర్వహణ

నెల్లిమర్ల : ప్రయివేట్ పాఠశాలల్లో రికార్డులు సక్రమంగా నిర్వహించాలని ఎంఇఒ ఈపు విజయ్‌కుమార్ సూచించారు. శనివారం నగర పంచాయతీ, మండలంలోని ప్రయివేట్ పాఠశాలలను ఆయన సందర్శించారు. రికార్డులు తనిఖీ చేశారు. హాజరుపట్టిక, ఆన్‌లైన్‌కి తేడాలు లేకుండా రికార్డులు సక్రమంగా ఉండాలని ఆదేశించారు. చదవకుండా ధ్రువపత్రాలు జారీచేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

రాష్ట్ర స్థాయి పోటీలకు ధర్మవరం విద్యార్థులు

శృంగవరపుకోట : మండలంలోని ధర్మవరం జిల్లా పరిషత్తు ఉన్నత పాఠశాలకు చెందిన ఇద్దరు విద్యార్థులు ఎస్‌జిఎఫ్ రాష్ట్ర స్థాయి రగ్బీ పోటీలకు ఎంపికైనట్లు పాఠశాల పీడీ పొట్నూరు శ్రీరాములు తెలిపారు. బొండపల్లి మండలం గరుడబిల్లిలో జరిగిన జిల్లా స్థాయి స్కూల్ గేమ్స్ రగ్బీ పోటీల్లో అండర్-17 విభాగంలో పెద్దింటి రాజేష్, చుక్క పావని సత్తాచాటారని చెప్పారు. వీరిని పాఠశాల ప్రధానోపాధ్యాయులు బంగారు ఉమామహేశ్వరరావు, ఉపాధ్యాయులు అభినందించారు.

బోరు బావికి శంకుస్థాపన

శృంగవరపుకోట : మండలంలోని తిమిడి జిల్లా పరిషత్తు ఉన్నత పాఠశాలలో బోరుబావి ఏర్పాటుకు ఎంపిపి ఎస్.సోమేశ్వరరావు శనివారం శంకుస్థాపన చేశారు. అనంతరం పాఠశాలను సందర్శించి, విద్యార్థులతో మాట్లాడారు. కార్యక్రమంలో వైస్ ఎంపిపి ఇందుకూరి సుధారాజు, సర్పంచ్ ఒబ్బిన త్రినాథమ్మ, ఎంపిటిసి పి.ధర్మారావు, పాఠశాల కమిటీ చైర్మన్ వెంకటరావు, మాజీ సర్పంచ్ కె.వెంకటరావు, నాయకులు సతీష్ పాల్గొన్నారు.

జగనన్న కాలనీల్లో నివాసమెలా?

టిడిపి రాష్ట్ర కార్యదర్శి గొంప కృష్ణ

జగనన్న కాలనీని పరిశీలిస్తున్న టిడిపి రాష్ట్ర కార్యదర్శి గొంప కృష్ణ

ప్రజాశక్తి-వేపాడ

కొండకు ఆనుకుని ఏర్పాటుచేసిన జగనన్న కాలనీలో లబ్ధిదారులు ఎలా నివశిస్తారని టిడిపి రాష్ట్ర కార్యదర్శి గొంప కృష్ణ ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. శనివారం వేపాడ గ్రామానికి చెందిన 48 మందికి మంజూరు చేసిన ఇళ్ల స్థలాలను పరిశీలించారు. చాలామంది లబ్ధిదారులు పునాదుల వరకు నిర్మాణాలు చేపట్టి నిలిపివేయడాన్ని ఆయన గుర్తించారు. కొండకు ఆనుకొని ఇంటి స్థలాలు మంజూరు చేయడం, గ్రామానికి సుమారు రెండు కిలోమీటర్ల దూరంలో ఉండడం వల్ల లబ్ధిదారులు గృహ నిర్మాణాలు చేపట్టడం లేదని ఆయన తెలిపారు. వాలంటీర్‌కు గ్రామంలో ఇల్లు ఉన్నా.. జగనన్న లేఅవుట్‌లో ఎలా మంజూరు చేశారని ప్రశ్నించారు. కార్యక్రమంలో తెలుగు మహిళా నియోజకవర్గ అధ్యక్షులు గుమ్మడి భారతి, టిడిపి మండల అధ్యక్షులు గొంప వెంకటరావు. ఎస్.గణేష్, ముక్క రామకృష్ణ పాల్గొన్నారు

అగ్ని ప్రమాద బాధితులకు ఆర్థికసాయం

నల్లబెల్లి గ్రామంలో ఇటీవల అగ్ని ప్రమాదంలో సర్వం కోల్పోయిన బాధితులు రెడ్డి లక్ష్మి, గొర్లె గౌరికి రూ.5 వేలు చొప్పున టిడిపి రాష్ట్ర కార్యదర్శి గొంప కృష్ణ సాయం చేశారు. విఘ్నేశ్వర ఆలయానికి రూ.5వేలు అందించారు. అనంతరం గ్రామంలో సీనియర్ టిడిపి నాయకులు రంది ముసలి నాయుడు, బోజంకి మహేష్‌ను కలిసి మాట్లాడారు. కార్యక్రమంలో టిడిపి నాయకులు బి.నారాయణరావు, రంధి నరసింహం, ఎం.రామకృష్ణ, సిరికి రమణ, తదితరులు పాల్గొన్నారు.

గౌరీ పరమేశ్వరులను దర్శించుకున్న గొంప కృష్ణ

మండలంలోని అరిగిపాలెంలో గౌరీ పరమేశ్వరుల విగ్రహాలను టిడిపి రాష్ట్ర కార్యదర్శి గొంప కృష్ణ దర్శించుకున్నారు. ఉత్సవ కమిటీకి రూ.5 వేలు విరాళం అందజేశారు. కార్యక్రమంలో టిడిపి మండల అధ్యక్షులు గొంప వెంకటరావు, తెలుగు యువత మండల అధ్యక్షులు ముక్క రామకృష్ణ పాల్గొన్నారు.

సీతంలో ఘనంగా ఫ్రెషర్స్ డే వేడుకలు

ప్రజాశక్తి-విజయనగరం

స్థానిక సీతం ఇంజినీరింగ్ కళాశాలలో 'ఆరంభ్' పేరుతో శనివారం ఫ్రెషర్స్ డే వేడుకలు ఘనంగా జరిగాయి. వేడుకలకు జెఎన్‌టియు జివి వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ కె.వెంకట సుబ్బయ్య ముఖ్య అతిథిగా విచ్చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు తాను ఎంచుకున్న బ్రాంచ్‌ను ఇష్టపడి, ఆ రంగంలో తనను తాను తీర్చిదిద్దుకోవాలని అన్నారు. ఇంజినీరింగ్ మొదటి రోజు నుంచి చదువు, భవిష్యత్తుపై దృష్టి పెట్టాలని అన్నారు. విద్యార్థులు సుస్థిరమైన అభివృద్ధి కోసం లోతైన జ్ఞానాన్ని కలిగి ఉండాలని, దానిని తమ జీవితంలో అన్వయించుకోవాలని కళాశాల డైరెక్టర్ డాక్టర్ మజ్జి శశిభూషణ్ రావు కోరారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ డి.వి.రామమూర్తి మాట్లాడారు. అనంతరం ముఖ్య అతిథి ప్రొఫెసర్ వెంకటసుబ్బయ్యను సత్కరించారు. రోబోటిక్స్



సర్టిఫికెట్లను అందజేస్తున్న జెఎన్‌టియుజివి విసి వెంకటసుబ్బయ్య

వర్క్‌షాప్‌కు హాజరైన అధ్యాపకులకు ప్రత్యేక గుర్తింపు, జాతీయ స్థాయి శిబిరాలకు హాజరైన ఎన్‌సిసి క్యాడెట్‌లకు సర్టిఫికెట్లు అందజేశారు. వివిధ కార్యక్రమాల్లో ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు, అధ్యాపకులకు సర్టిఫికెట్లు, బహుమతులు అందజేశారు. వివిధ సాంస్కృతిక కార్యక్రమాలు ప్రేక్షకులను ఆకట్టుకున్నాయి.

పార్టీలకతీతంగా సంక్షేమ పథకాలు

ఎమ్మెల్యే బొత్స అప్పలనరసయ్య

ప్రజాశక్తి-గజపతినగరం

పార్టీలకతీతంగా సంక్షేమ పథకాలు అందించామని ఎమ్మెల్యే బొత్స అప్పలనరసయ్య అన్నారు. శనివారం స్థానిక వైసిపి కార్యాలయంలో విలేకరుల సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ టిడిపి, జనసేనలకు అధికార యావ తప్ప ప్రజల సంక్షేమం అవసరం లేదనడానికి వాళ్ల ఆత్మీయ సమావేశాలలో జరుగుతున్న గొడవలే ఉదాహరణ అన్నారు. చిన్న చిన్న గుంతలను భూతద్దంలో చూపించి రోడ్లు బాలేవంటూ అసత్య ప్రచారాలు చేయడమే పనిగా పెట్టుకున్నారని విమర్శించారు. టిడిపిలో సామాజిక న్యాయం లేదని, ఆ పార్టీ అధికారంలో ఉన్నప్పుడు అభివృద్ధికి నోచుకోలేదని చెప్పారు. నియోజకవర్గంలో ఎవరి హయాంలో అభివృద్ధి చెందిందనేది జనాలకు తెలుసని వ్యాఖ్యానించారు. కార్యక్రమంలో జెడ్‌పిటిసి గార తవుడు, బూడి వెంకటరావు, కరణం ఆదినారాయణ, మండల సురేష్ పాల్గొన్నారు.

ప్రభుత్వ పథకాలే మళ్లీ గెలిపిస్తాయి

భోగాపురం : ప్రభుత్వ పథకాలే మళ్లీ తమను గెలిపిస్తాయని ఎమ్మెల్యే బడ్డుకొండ అప్పలనాయుడు తెలిపారు. మండలంలోని రెడ్డికంచేరు పంచాయతీ పరిధిలోని రెడ్డికంచేరు, పిన్నింటిపాలెం, గాబువానిపాలెం గ్రామాల్లో గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం శనివారం జరిగింది. ఎమ్మెల్యేతోపాటు వైసిపి మండల అధ్యక్షులు ఉప్పాడ సూర్యనారాయణ రెడ్డి పాల్గొని ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాల గురించి ప్రజలకు వివరించారు. సంక్షేమ వివరాలతో కూడిన బుక్‌లెట్లను అందజేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు పడాల భానుప్రకాశ్, సర్పంచ్ బైరెడ్డి రమణరెడ్డి, సచివాలయ కన్వీనర్ శీరపు గురునాథ్‌రెడ్డి, మాజీ జెడ్‌పిటిసి బైరెడ్డి ప్రభాకర్ రెడ్డి, దల్లి బంగారిరెడ్డి, సుందర హరీష్, శీరపు వంశి, తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్‌షాక్‌తో కార్మికుడు మృతి

రూ.50 లక్షలు పరిహారం ఇవ్వాలని సిఐటియు డిమాండ్

ప్రజాశక్తి-విజయనగరంటౌన్

శ్రీకాకుళం జిల్లా పైడిభీమవరంలో గల అరబిందో ఫార్మా (ఎపిటోరియా) పరిశ్రమలో శనివారం సాయంత్రం ప్రొడక్షన్ బ్లాక్‌లో విద్యుత్ షాక్‌తో కార్మికుడు మృతి చెందాడు. నాలుగు గంటల సమయంలో ప్రొడక్షన్ బ్లాక్ 1లో విద్యుత్ ప్యానెల్ బోర్డు రిపేరు చేస్తుండగా విద్యుత్ షాక్‌తో దశరథ్ ప్రొఫెషనల్స్ సర్వీసెస్ కాంట్రాక్టులో ఎలక్ట్రీషియన్‌గా పనిచేస్తున్న పూసపాటిరేగ మండలం రెల్లివలస గ్రామానికి చెందిన మహంతి బాలకృష్ణ (27) తీవ్రంగా గాయపడి మృతి చెందాడు. యాజమాన్యం వెంటనే మృతదేహాన్ని కుటుంబ సభ్యులకు సైతం చూపించకుండా పోలీసులను పెట్టి విజయనగరం సర్వజన ఆస్పత్రికి తరలించి పోస్టుమార్టం మార్చురీలో పెట్టేశారు. విషయం తెలుసుకున్న సిఐటియు శ్రీకాకుళం జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు సిహెచ్ అమ్మన్నాయుడు, పి.తేజేశ్వరరావు, కార్యదర్శి ఎన్‌వి రమణ, విజయనగరం జిల్లా ప్రధాన కార్యదర్శి కె.సురేష్, నాయకులు రెడ్డి శంకర్రావు, బి.సూర్యనారాయణ ఆస్పత్రి వద్దకు చేరుకొని మృతదేహాన్ని పరిశీలించారు. ప్రమాదంలో చనిపోయిన కార్మికుడి కుటుంబానికి 50. లక్షల రూపాయలు నష్టపరిహారం

కార్మికుడి మృతదేహాన్ని పరిశీలిస్తున్న సిఐటియు నాయకులు

చెల్లించాలని యాజమాన్యాన్ని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా సిఐటియు నాయుకులు, కుటుంబ సభ్యులు, గ్రామ పెద్దలు, గ్రామస్థులు నిరసన వ్యక్తం చేసారు. కార్మికుడి తల్లిని, కుటుంబ సభ్యులను నాయకులు ఓదార్చారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అరబిందో యాజమాన్యం సరైన భద్రతా ప్రమాణాలు పాటించకపోవడం వలనే తరుచూ ప్రమాదాలు జరిగి కార్మికులు చనిపోతున్నారని అన్నారు. గతంలో పలు ప్రమాదాలలో కార్మికులు చనిపోయిన విషయాన్ని గుర్తు చేసారు. అరబిందో యాజమాన్యానికి లాభాలు తప్ప కార్మికుల ప్రాణాలకు విలువ ఇవ్వడం లేదని విమర్శించారు. ప్రభుత్వ యంత్రాంగం సరైన భద్రతా చర్యలు తీసుకోకపోవడంతో యాజమాన్యాలు ఇష్టానుసారంగా వ్యవహరిస్తున్నాయని అన్నారు.

పారిశుధ్య పనుల పరిశీలన

విజయనగరం టౌన్ : నగరంలోని వివిధ ప్రాంతాలలో ప్రజారోగ్యాధికారి డాక్టర్ కొండపల్లి సాంబమూర్తి పర్యటించి అమలవుతున్న పారిశుధ్య పనులను పర్యవేక్షించారు. నగరపాలక సంస్థలో రోజువారి వీధుల్లో భాగంగా ఎనిమిదో సర్కిల్‌లో పర్యటించి ఇంటింటా జరుగుతున్న చెత్త సేకరణ విధానాన్ని గమనించారు. ఆరు బయట చెత్త వేసిన దుకాణాల యజమానులకు మందలించి ఇక నుండి రోడ్లపై చెత్తను వేయరాదని డస్ట్ బిన్స్ వాడాలని సూచించారు. పర్యావరణ కార్యదర్శులతో సమావేశం నిర్వహించారు.

ప్లాస్టిక్ కంపెనీలో వాచ్‌మేన్ హత్య

ప్రజాశక్తి-విజయనగరం కోట

నగరంలోని విటి అగ్రహారం ఇండస్ట్రియల్ ఏరియాలోని ప్లాస్టిక్ కంపెనీలో వాచ్‌మేన్ శనివారం అర్ధరాత్రి హత్యకు గురయ్యాడు. విటి అగ్రహారానికి చెందిన బంటుపల్లి అప్పలనాయుడు (71) ఓ ప్లాస్టిక్ కంపెనీలో కొంత కాలంగా వాచ్‌మేన్‌గా పనిచేస్తున్నాడు. అదే కంపెనీలో పనిచేస్తున్న బీహార్ ప్రాంతానికి చెందిన కౌనాల్ శనివారం రాత్రి 9:30గంటల సమయంలో మిషన్‌కు సంబంధించిన కటింగ్ బ్లేడ్లు దొంగచాటుగా విక్రయించేందుకు బయటకు పట్టుకుని వెళ్తుండగా వాచ్‌మేన్ అప్పలనాయుడు అడ్డుపడ్డాడు. దీంతో అతన్ని తీవ్రంగా కొట్టి బయటకు వెళ్లిపోయాడు. దీంతో ఆయన పక్కనే ఇంకో కంపెనీలో పనిచేస్తున్న వాచ్‌మేన్‌కు విషయం చెప్పడంతో ఆయన అప్పలనాయుడు ఇంటికి ఫోన్ చేశాడు. అతని కుటుంబ సభ్యులు వచ్చి కట్టుకట్టి ఇంటికి వెళ్లిపోదామని చెప్పినా, కంపెనీ వద్ద కాపలా లేకపోతే ఎలా అని చెప్పి అక్కడే ఉండిపోయాడు. అర్ధరాత్రి కౌనాల్ వచ్చి రాడ్డుతో కొట్టి అప్పలనాయుడును హతమార్చాడు. శనివారం తెల్లవారి 6గంటలకు శ్రీను అనే పనివాడు వచ్చి గేట్లు కొడుతుంటే తలుపులు తెరవకపోవడంతో గోడదూకి లోపలకు వచ్చాడు. అప్పటికే వాచ్‌మేన్ అప్పలనాయుడు రక్తపు మడుగులో ఉండడంతో వెంటనే సహోద్యుగులకు చెప్పాడు. పోలీసులకు కూడా సమాచారం ఇవ్వడంతో రూరల్ సిఐ టివి తిరుపతిరావు, ఎస్ఐ బి.గణేష్, గంట్యాడ ఎస్ఐ కిరణ్, రూరల్ ఎఎస్ఐ రామారావు పరిశీలిం చారు. నిందితుడి కోసం పోలీసులు గాలించారు. కౌనాల్ తన బ్యాగు తీసుకుని రైల్వే స్టేషన్ వైపు వెళ్లిపోతున్నట్లు సమాచారం అందడంతో పోలీసులు పట్టుకొని స్టేషన్‌కు తరలించారు. కంపెనీ యజమానులు వచ్చి సమాధానం చెప్పాలని, అంతవరకు మృతదేహాన్ని తరలించేందుకు వీలు లేదని అప్పల నాయుడు కుటుంబ సభ్యులు పట్టుబట్టారు. దీంతో పోలీసులు కంపెనీ యజమానులైన గౌతం, రాము ఫోన్ చేశారు. వారు అందుబాటులో లేకపోవడంతో సాయంత్రం 6గంటల వరకు మృతదేహాన్ని అక్కడే ఉంచారు. వారు వచ్చిన తరువాత అక్కడి నుంచి పోస్టుమార్టం కోసం తరలించేందుకు ఆస్పత్రికి తరలించారు.

హత్యకు గురైన వాచ్‌మేన్ అప్పలనాయుడు

ఐదు ఎకరాల చెరకు తోట దగ్ధం

ప్రజాశక్తి-రేగిడి

మండలంలో ఖండ్యాం గ్రామంలో విద్యుత్తు వైర్లు తెగి ఐదు ఎకరాల చెరకు తోట శనివారం తెల్లవారుజామున దగ్ధమైంది. ఈ ఘటనలో గొల్వి జగ్గునాయుడు, కింజరాపు భాస్కరరావుకు చెందిన పొలాల్లో పెద్ద మంటలు వ్యాపించాయి. స్థానిక రైతులు బాధితులకు సమాచారం అందించారు. పంట పొలాల పైన విద్యుత్తు లైన్ ఉండడంతో షార్ట్ సర్క్యూట్ కారణంగా మంటలు వ్యాపించినట్లు రైతులు చెప్పారు. స్థానికులు పాలకొండ ఫైర్ స్టేషన్‌కి సమాచారం అందించారు.. సంఘటన స్థలానికి వచ్చేసరికి పూర్తిగా చెరకు తోటలు దగ్ధమయ్యాయి. పక్కన ఉన్న చెరకు తోటలకు మంటలు వ్యాపించకుండా నీటితో తడిపారు. ఫైర్, రెవెన్యూ అధికారులు నాలుగున్నర లక్షల రూపాయలు పంట నష్టం వాటిల్లినట్లు అంచనా వేశారు. తక్షణమే నష్టపరిహారం అందించాలని ప్రభుత్వానికి కోరారు.